క్లుప్తంగా

పొంచి ఉన్న ప్రమాదం



మండల కేంద్రంలో ప్రధాన రహదారి పక్కనే గుంత తవ్వి వదిలేసిన దృశ్యం

రొద్దం: మండలంలో కేబుల్ ఏర్పాటు కోసం రోడ్డుకు అనుకుని గుంతలు తవ్విన నిర్వాహకులు వాటిని పూడ్చి పెట్టకుండా ఉండడంతో తరుచూ ప్రమాదాలు జరుగున్నాయి. ఇప్పటికే ఇద్దరు మృత్యువాత పడగా పలువురు తీవ్ర గాయాలతో బయటపడ్డారు. కొన్ని నెలలుగా ప్రైవేట్ కంపెనీ వారు ఫైబర్ నెట్ కోసం రోడ్డుకు ఇరువైపులా గోతులు తవ్వి కేబుల్ వేశారు. అయితే అక్కడక్కడ కేబుల్ వేసి గుంతలు పూడ్చకపోవడంతో రాత్రి వేళ ద్విచక్ర వాహనాలు దారులు మట్టి దిబ్బలను ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా రెడ్డిపల్లి చెరువు కట్టపై, మండల కేంద్రంలోని పావగడ–పెనుకొండ ప్రధాన రహదాకి పక్కన ఉన్న గోతులు పూడ్చాలని వాహదారులు కోరుతున్నారు.

'హామీలు నెరవేర్చండి'

మడకశిర: కూటమి నేతలు మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌పై తప్పుడు ఆరోపణలు చేయడాన్ని మానుకుని ఎన్నికల సందర్భంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి గురువారం ఒక ప్రకటనలో కోరారు. వైఎస్ జగన్‌ను విమర్శించే స్థాయి కూటమి నేతలకు లేదన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారని ధ్వజమెత్తారు. కూటమి ఎమ్మెల్యేలు దోచుకోవడానికి ప్రాధాన్యమిస్తూ ప్రజల సమస్యలను గాలికొదిరేశారని ఆరోపించారు. వైఎస్ జగన్ బటన్ నొక్కడాన్ని విమర్శించిన చంద్రబాబు ఈరోజు చేతనైతే బటన్ నొక్కి ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాలని ఆయన సవాల్ చేశారు. సూపర్ సిక్స్ పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేసే వరకూ వైఎస్సార్‌సీపీ తరపున పోరాటం చేస్తామన్నారు.

అసోసియేషన్ అభివృద్ధికి కృషి



దేవరాజ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

పావగడ: కర్ణాటక రాజ్య డ్రగ్స్ ఏజెంట్స్, సేల్స్ మెన్ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తానని అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు, స్థానిక శాంతి మెడికల్స్ నిర్వాహకుడు గంగినేని దేవరాజ్ గురువారం భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా అతడిని అసోసియేషన్ పదాధికారులు, సభ్యులు ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ అసోసియేషన్ సభ్యుల పిల్లల చదువుకు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి ఫార్మా క్రికెట్ లీగ్ టోర్నమెంట్ విజేతలకు ప్రథమ బహుమతులు అందించారు.

ఘనంగా సర్వజ్ఞ జయంతి



సర్వజ్ఞ చిత్ర పటానికి నివాలులర్పిస్తున్న తహసీల్దార్

పావగడ: సర్వ జ్ఞానాన్ని పొందిన వచనకారుడు, యోగి వేమన సమకాలీనుడు త్రిపద కవి సర్వజ్ఞ జయంతి వేడుకలు తాలూకా కార్యాలయం మీటింగ్ హాల్ లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వరదరాజు తదితరులు సర్వజ్ఞ చిత్ర పటానికి పూజలు చేసి ఘనంగా నివాళులర్పించారు. తహసీల్దార్ మాట్లాడుతూ 17వ శతాబ్దానికి చెందిన త్రిపద కవి సర్వజ్ఞ హావేరి జిల్లా అంబలూరు మాసూరు అనే గ్రామంలో జన్మించారని, తన వచనాలతో ఆనాడు సమాజంలో పేరుకు పోయిన సాంఘిక దురాచారాలు, మూఢాచారాలు, అసమానతలను తుద ముట్టించి సమ సమాజాన్ని నిర్మించారన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజగోపాల్, కార్యదర్శి సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి



జితేంద్రరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

సోమందేపల్లి: మండలంలో పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా కృషి చేస్తామని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండలాధ్యక్షుడు జితేంద్ర రెడ్డి తెలిపారు. గురువారం చల్లాపల్లిలో నూతన అధ్యక్షుడిని పార్టీ నాయకులు సత్కరించారు. కూటమి ప్రభుత్వం వైఫల్యాలపై రాజీలేని పోరాటం చేద్దామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గోవిందమ్మ గారి శ్రీనివాసులు, గట్ల మంజు, ఇమామ్ వలీ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారులు

- ఇబ్బందుల్లో గ్రామీణులు
- పట్టించుకోని ప్రభుత్వం

మడకశిరరూరల్: నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు వెళ్లే మట్టి రోడ్లు గుంతలు పడి అధ్వానంగా మారడంతో గ్రామీణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడంతోపాటు ప్రమాదాలకు గురవుతున్నారు. రొళ్ల, అగళి, అమరాపురం, గుడిబండ, మడకశిర మండలాల్లో చాలా గ్రామాలకు మట్టి రోడ్లు ఉండటంతో ప్రజలు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మకడకశిర మండలంలో టీడీపల్లి నుంచి గౌడనహళ్లి, జిల్లెడుగుంట తాండా నుంచి దొడ్డేపల్లి, దొమ్మరహట్టి నుంచి కొండంపల్లి, హరేసముద్రం నుంచి వైబీహళ్లి క్రాస్ వరకూ, రేకులకుంట నుంచి కంతీపురం వరకూ పెద్దపల్లి నుంచి ఎలాగానిగుట్ట వరకూ, సిద్దగిరి నుంచి కోతులగుట్ట వరకూ, మెళవాయి రోడ్డు నుంచి సింగేపల్లి వరకు, ఎగువ రామగి నుంచి ఏఆర్ రొప్పం తదితర గ్రామాలకు వెళ్లే మట్టి రోడ్లు గుంతలు పడి అధ్వానంగా మారాయి. అదేవిధంగా హిందుపురం మెయిన్ రోడ్డు నుంచి ఎల్లోటి గ్రామం వరకూ, దిగువ రామగిరి క్రాస్ నుంచి హెచ్‌ఆర్ పాళ్యం గ్రామం వరకూ కంకర తేలడంతో ప్రజలు, వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. కంకరతేలిన రోడ్లు, మట్టి రోడ్లను ఆర్‌అండ్‌బీ పరిధిలోకి తీసుకుని బాగు చేయాలన్నారు. చాలా గ్రామాలకు తారురోడ్డు సౌకర్యం ఉన్నా తమ గ్రామాలకు మట్టి రోడ్డే దిక్కు అని ప్రజలు వాపోతున్నారు. రోడ్లు అధ్వానంగా ఉండటంతో బస్సు సౌకర్యం కూడా లేకపోయిందని, దీంతో విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటూ మడకశిరకు చేరుకుంటున్నారు.



అధ్వానంగా ఉన్న టీడీపల్లి నుంచి గౌడనహళ్లి వెళ్లే మట్టి రోడ్డు



కంకర తేలిన హెచ్‌ఆర్ పాళ్యం రోడ్డు

మట్టి రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి

కూటమి ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇచ్చి గ్రామీణ రోడ్లను అభివృద్ధి చేయాలని గ్రామీణులు కోరుతున్నారు. చాలా గ్రామాలకు మట్టి రోడ్లే దర్శనమిస్తున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం, సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని అధ్వానంగా ఉన్న మట్టి, కంకర రోడ్లను బాగు చేసి ప్రజలు, విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించేలా చూడాలని కోరారు.

రోడ్లు అభివృద్ధి చేయాలి



ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు గుర్తించి కూటమి ప్రభుత్వం మట్టి రోడ్లను అభివృద్ధి చేయాలి. టీడీపల్లి గ్రామం నుంచి గౌడనహళ్లికి మట్టి రోడ్డు ఉండడంతో ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. వర్షాకాలంలో అయితే మరింత ఇబ్బంది పడుతున్నాం. మట్టి రోడ్డును తారు రోడ్డుగా మార్పు చేసి ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాలి.

– నరసింహులు, గౌడనహళ్లి, మడకశిర మండలం

ప్రభుత్వం చొరవ తీసుకోవాలి



ప్రభుత్వం చొరవ తీసుకుని మట్టి రోడ్లను తారు రోడ్డుగా మార్చాలి. హరేసముద్రం పంచాయతీలో వివిధ గ్రామాలకు మట్టి రోడ్లు ఉండడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి సమయంలో రోడ్డుపై వెళ్లడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ స్పందించి మట్టి రోడ్లను అభివృద్ధి చేయాలి.

– కరియన్న, సర్పంచ్, హరేసముద్రం, మడకశిర మండలం

నాణ్యమైన భోజనం అందించాలి



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న ఆర్డీఓ

లేపాక్షి: ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని పెనుకొండ ఆర్డీఓ ఆనంద్ కుమార్ తెలిపారు. గురువారం కంచిసముద్రం రోడ్డులో ఉన్న బీసీ హాస్టల్‌ను తనిఖీ చేశారు. వంటగది, పరిసరాలు, వంట సరకులను పరిశీలించారు. అనంతరం హాస్టల్ విద్యార్థులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. రుచికరంగా వంట తయారు చేస్తున్నారా? కడుపు నిండా భోజనం పెడుతున్నారా అని ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. హాస్టల్‌కు పక్కా భవనం లేదా అని వార్డెన్ ఓబుళరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. బాత్ రూములు ఉన్నాయా అని ప్రశ్నించగా.. పాఠశాల ఆవరణలో ఉన్న వాటిని వాడుకుంటున్నట్టు వార్డెన్ సమాధానం ఇచ్చారు. హాస్టల్ భవనంలో సౌకర్యాల కల్పనకు సుమారు రూ.12 లక్షల నిధులు మంజూరు కాగా.. టెండర్లు పిలువ లేదా అని ఆర్డీఓ ప్రశ్నించారు. ఈ విషయంపై ఏబీసీ డబ్ల్యూఓ సుబ్బరాయుడుతో ఫోన్‌లో మాట్లాడారు. టెండర్లు పూర్తి అయ్యాయని, మైనర్ రిపేరీ పనులు చేపట్టడడానికి ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు ఏబీసీడబ్ల్యూఓ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సౌజన్యలక్ష్మి పాల్గొన్నారు.

వైఎస్సార్ మెమోరియల్ క్రికెట్ టోర్నీ ప్రారంభం



బ్యాటింగ్ చేస్తున్న వేణురెడ్డి

చిలమత్తూరు: క్రీడాకారులకు ప్రోత్సహించి ఉన్నత శిఖరాలకు చేరేందుకు వైఎస్సార్‌సీపీ తోడ్పాటు అందిస్తుందని పార్టీ నియోజకవర్గ నేత వేణురెడ్డి అన్నారు. గురువారం హిందూపురం పట్టణ పరిధిలోని మోతుకపల్లి సమీపంలో డా.వైఎస్సార్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు షబ్బీర్, దాదాపీర్, షాహిద్, తౌషిప్, ఇర్ఫాన్, నయాజ్ ఆధ్వర్యంలో ఈ టోర్నీ నిర్వహిస్తున్నారు. టోర్నీలో 20 జట్లు పాల్గొంటుండగా.. విజేతకు రూ.30 వేలు, రన్నర్‌కు రూ.20 వేలు అందజేయనున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా, నాయకులు లక్ష్మీనారాయణ రెడ్డి, మహేష్ గౌడ్, న్యాతరెడ్డి, శబరీష్ రెడ్డి, ఫారుఖ్, అయూబ్ బేగ్, బాబాజాన్, నవీన్‌రెడ్డి, ఇనాయత్ పాల్గొన్నారు.

చట్టం దృష్టిలో అందరూ సమానమే



మాట్లాడుతున్న న్యాయమూర్తి రమణయ్య

హిందూపురం అర్బన్: చట్టం దృష్టిలో పేద, ధనిక అన్న తారతమ్యం లేకుండా అందరూ సమానమేనని స్థానిక ప్రత్యేక న్యాయమూర్తి ఎస్.రమణయ్య పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సామాజిక సమస్యలపై న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయవాదులను ఏర్పాటు చేసుకోలేని పేద వర్గాలకు ప్రభుత్వమే ఉచిత న్యాయ సహాయం అందిస్తుందన్నారు. అలాగే మార్పు జరిగిన చట్టాలకు అనుగుణంగా ఆడపిల్లలకు ఆస్తి హక్కులో సమాన భాగం ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం వన్‌టౌన్ ఎస్ఐ శ్రీధర్ సైబర్ నేరాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ వెంకటేష్, బార్ అసోషియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాస రెడ్డి, న్యాయవాదులు కళావతి, నవేరా, మురళి, ఈశ్వరయ్య, రవికుమార్, భాగ్య, లైజనింగ్ అధికారి శ్రీనివాసులు లోక్ అదాలత్ సిబ్బంది హేమావతి, శారద పాల్గొన్నారు.

ఘనంగా శివ జయంతి ఉత్సవం



తమ్మడేపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అమరాపురం: మండలంలోని తమ్మడేపల్లిలో గురువారం సాయంత్రం శివ జయంతి ఉత్సవాలను స్థానిక ఈశ్వరీయ బ్రహ్మకుమారి విశ్వ విద్యాలయం నిర్వాహకులు సిద్దేశ్వర ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివ భక్తులు తమ్మడేపల్లిలో శివలింగంతో శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ముఖ్య అతిథిగా విచ్చేసిన అమరాపురం ఈశ్వరీయ విశ్వ విద్యాలయం నిర్వహకురాలు పుష్పక్క మాట్లాడుతూ శివరాత్రి, శివుడి విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో శివభక్తులు సిద్దేశ్వర, జయరామప్ప పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు అన్యాయం



సోమందేపల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం



గోరంట్లలో నినాదాలు చేస్తున్న దృశ్యం

సోమందేపల్లి: కేంద్ర బడ్జెట్‌తో జిల్లాకు జరిగిన మేలు ఏమీ లేదని సీపీఎం మండల కార్యదర్శి రంగప్ప విమర్శించారు. బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ప్లకార్డులు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. రాస్తారోకో చేసేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు హనుమయ్య, నాయకులు వెంకటేష్, నారాయణ స్వామి, కిష్టప్ప, మాబు, గంగరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల: కేంద్ర బడ్జెట్ పారిశ్రామిక వేత్తలకు అనుకూలంగా, పేదలకు వ్యతిరేకంగా ఉందని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌పై గురువారం వ్యసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్దన్న, భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గ కన్వీనర్ కొండ వెంకటేశు ఆధ్వర్యంలో హిందూపురం – కదిరి రహదారిపై నిరసన ర్యాలీ చేపట్టారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు స్వర్ణలత, అంజనాదేవి, ముత్యాలప్ప వెంకటలక్ష్మమ్మ,తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు: మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌ను నిరసిస్తూ ర్యాలీనిర్వహించారు. సీపీఎం జిల్లా నాయకుడు ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సంపన్నులకు, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉందని విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా అంశం ప్రస్తావన లేకపోవడం కూటమి రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం అని అన్నారు.

కార్మిక వర్గాన్ని పూర్తిగా విస్మరించిందని, ఆహార సబ్సిడీలు, వ్యవసాయం, విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, సామాజిక సంక్షేమానికి గతేడాది కంటే తగ్గించడం దారుణమని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌ను సవరించాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్, మండల నాయకులు రామచంద్ర, మంజునాథ్, రైతు సంఘం నాయకులు లక్ష్మినారాయణ, సదాశివరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రుణాల మంజూరుకు ఇంటర్వ్యూలు

అమరాపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓ విశ్వేశ్వర ఆరాధ్య ఆధ్వర్యంలో వివిధ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా వలస కెనరాబ్యాంకు మేనేజర్ అశోక్, అధికారులు నిరుద్యోగ యువతీ యువకులను ఇంటర్వ్యూ చేశారు.

అగళి: సబ్సిడీ రుణాల ఎంపికకు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీఓ యాదవేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్వ్యూలకు 152 మంది హాజరయ్యారు.కర్ణాటక బ్యాంక్ మేనేజర్ హరిప్రసాద్, గ్రామీణ బ్యాంక్ మేనేజర్ రవిచంద్ర, జూనియర్ అసిస్టెంట్ అమృత వలి, ఈఓఆర్డీ పద్మ తదతరులు పాల్గొన్నారు.

రొళ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ కార్పొరేషన్ల ద్వారా అందించే సబ్సిడీ రుణాల కోసం అధికారులు గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలానికి 10 యూనిట్లకు గానూ 315 మంది అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకున్నారు. అందులో ఇంటర్వ్యూలకు 257 మంది అభ్యర్థులు హాజరయ్యారు. అభ్యర్థుల సర్టిఫికెట్లను ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామారావుతో పాటు రొళ్ల, రత్నగిరి ఆంధ్రప్రగతి గ్రామీణా బ్యాంక్ మేనేజర్లు నాగనందం, క్రిష్ణమూర్తి, కెనరా బ్యాంక్ మేనేజర్ నాగరాజు తదితరులు పరిశీలించారు. మండల పరిషత్ ఏఓ ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ రెహమాన్, ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ బాబురావు, అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మహిళ ఆత్మహత్యాయత్నం

గోరంట: బూచేపల్లిలో ఓ మహిళ విషద్రావకం తాగి ఆత్మహత్యకు యత్నించింది. వివరాలు.. గ్రామానికి చెందిన కుమార్ చాలామంది వద్ద అప్పు చేశాడు. ఈక్రమంలో అప్పు ఇచ్చిన వారు తరచూ ఇంటి వద్దకు వచ్చి గొడవ చేస్తుండేవారు. దీంతో కుమార్ భార్య జ్యోతి తీవ్రమనస్థాపానికి గురైంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో విషద్రావకం తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పొలం కంచె అపహరణ

పెనుకొండ రూరల్: కొండంపల్లిలో రైతు రామచంద్రారెడ్డి పొలానికి వేసిన కంచెను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. దాదాపు రూ.10 వేలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు. సమీపంలోని పొలంలో రూ.10 వేల విలువజేసే డ్రిప్ రోల్స్, స్ప్రింక్లర్ పైపులు ఎత్తుకెళ్లినట్లు బాధిత రైతు నాగిరెడ్డి తెలిపారు.

జియో సేవల అంతరాయంపై ఆందోళన

గోరంట్ల: నెట్‌వర్క్ సేవలు సరిగా అందించని జియో సంస్థపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం వినియోగదారుల ఫోరం నాయకులు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా జియో నెట్‌వర్క్‌ను వేలాదిమంది వినియోగిస్తున్నారన్నారు. దాదాపు 20 రోజుల నుంచి సంస్థ సేవుల అధ్వానంగా మారాయన్నారు. అలాగే బీఎస్‌ఎన్‌ఎల్ సేవలు కూడా సరిగా అందడం లేదన్నారు. సంస్థలపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు. మండల వినియోగదారుల ఫోరం అధ్యక్షుడు డాక్టర్ రామయ్య, ఫోరం నాయకులు ల్యాబ్ రామకృష్ణారెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు అందించకుంటే చర్యలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ శుభ కళ్యాణ్

పావగడ: రక్షిత తాగునీరు సకాలంలో నాగేనహళ్లి గ్రామస్తులకు అందివ్వకుంటే సంబంధిత గ్రామ పంచాయతీ అధికారులపై కఠిన చర్యలు తప్పవని తుమకూరు జిల్లా కలెక్టర్ శుభ కళ్యాణ్ హెచ్చరించారు. ఆమె గురువారం తాలూకాలోని నాగేనహళ్లిని సందర్శించారు. 'నాగేనహళ్లిలో నీటి ఎద్దడి' అనే శీర్షికతో ఇటీవల సాక్షి పత్రికలో ప్రచురించిన వార్త పాఠకులకు విదితమే. ఈ సందర్భంగా ఆమె గ్రామాన్ని పరిశీలించారు. గ్రామంలో పేరుకుపోయిన చెత్తను చూసి విస్మయం చెందారు. ఎప్పటికప్పుడు చెత్తను తరలించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు. అలాగే గ్రామస్థుల కోరిక మేరకు ఆర్వో ప్లాంట్‌లో సిస్టమ్ను తక్షణమే ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామస్తులకు ఎలాంటి పరిస్థితుల్లోనూ నీటి కొరత రానివ్వకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఎస్ జి.ప్రభు, తహసీల్దార్ వరదరాజు, పీడీఓ సుదర్శన్, గ్రామ పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు శిక్షణ

చిలమత్తూరు: ఆరురోజుల పాటు అంగన్వాడీ కార్యకర్తలకు నిర్వహించనున్న జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. గురువారం మండలంలోని టేకులోడు గురుకుల పాఠశాల, జడ్పీహెచ్‌ఎస్ ఉరూ పాఠశాలలో పిల్లల్లో భాషాభివృద్ధిపై శిక్షణ ఇచ్చారు. ఎంఈఓ–2 సాల్మన్‌రాజు, సీడీపీఓ శాంతి, సూపర్‌వైజర్లు రాధ, లలిత, సునీతమ్మ, గంగరత్నమ్మ పాల్గొన్నారు.

రొళ్ల: అంగన్‌వాడీ కేంద్రాలకు హాజరయ్యే చిన్నారుల విద్యాభివృద్ధికి అంగన్‌వాడీవర్కర్లు కృషి చేయాలని ఎంఈఓ శ్రీధర్ సూచించారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడో రోజు అంగనవాడీ వర్కర్లకు జరుగుతున్న జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులను ఎంఈఓ పరిశీలించారు.

అగళి: చిన్నారులకు తొలి గురువులు అంగన్‌వాడీ కార్యకర్తలని ఎంఈఓ చంద్రశేఖర్ నాయుడు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని గురువారం పరిశీలించారు. పూర్వ ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల విజ్ఞాన స్వరూపాన్ని తీర్చిదిద్దే సామర్థ్యాలు అంగన్‌వాడీల సొంతమన్నారు.

అమరాపురం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మూడో రోజు అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం కొనసాగింది. అంగన్‌వాడీలకు బాషాభివృద్ధిపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్పీలు యంజేరప్ప, యువరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కమలమ్మ పాల్గొన్నారు.

లేపాక్షి ఉత్సవాలకు రండి



సమన్వయకర్త దీపికకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ రమానందన్

చిలమత్తూరు: లేపాక్షిలోని వీరభద్రస్వామి ఆలయంలో జరిగే మహా శివరాత్రి ఉత్సవాలకు రావాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపికను ఆలయ కమిటీ చైర్మన్ రమానందం గురువారం ఆహ్వానించారు. అలాగే ఏపీ ఆగ్రోస్ మాజీ చైర్మన్ నవీన్‌నిశ్చల్, మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, పార్టీ మహిళా నాయకురాలు చౌళూరు మధుమతిరెడ్డిని వేర్వేరుగా కలసి ఆహ్వాన పత్రికలు అందజేశారు.

సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు



విత్తనాలకు ఘన జీవామృతం కలిపిన దృశ్యం

మడకశిరరూరల్: రైతులు సేంద్రియ వ్యవసాయం పద్ధతుల ద్వారా పంటలను సాగు చేసి అధిక ఆదాయం పొందాలని రైతు సాధికార సంస్థ కమ్యూనికేషన్ టీమ్ సభ్యురాలు మల్లేశ్వరి తెలిపారు. గురువారం ఆమిదాలగొంది, పత్తికుంట గ్రామాల్లో రైతులు మంజునాథ్, ప్రసన్న, గంగప్ప పొలాల్లో ఘన జీవామృతంతో నవధాన్యాల విత్తనాలను సాగు చేయించారు. ఆమె మాట్లాడుతూ ఘన జీవామృతం భూసారాన్ని మెరుగుపచడంతో పాటు నీటి వినియోగాన్ని తగ్గిస్తుందన్నారు. తక్కువ ఖర్చుతో రైతు లాభాలు పొందవచ్చున్నారు. అనంతరం ఘన, ద్రవ జీవామృతం తయారు, నవధాన్యాల సాగు, సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో డివిజన్ ప్రకృతి వ్యవసాయం ఇన్‌చార్జ్ రమేష్, హెల్త్ ఫ్యూట్రిషన్ సభ్యులు జ్యోతి, ప్రకృతి వ్యసాయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సుంకాల వసూళ్ల వేలం వాయిదా

మడకశిర: మడకశిర మున్సిపాలిటి పరిధిలోని దినసరి కూరగాయల మార్కెట్, వారపు సంత, బస్టాండ్ పార్కింగ్ స్థలాల సుంకాల వసూలుకు మున్సిపల్ అధికారులు గురువారం కార్యాలయంలో వేలం నిర్వహించారు. కమిషనర్ రంగస్వామి ఆధ్వర్యంలో వేలం నిర్వహించగా.. ఎవరూ పాల్గొనలేదు. దీంతో వేలంను ఈ నెల 28న మధ్యాహ్నం 2 గంటలకు కార్యాలయంలో మళ్లీ నిర్వహించనున్నట్లు కమిషన్ తెలిపారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు పరిగి విద్యార్థులు



రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం కృపా సత్యరాజు, పీడీ వినోద్

పరిగి: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. ఇటీవల ఉమ్మడి అనంతపురం జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సీనియర్ ఉమెన్ హ్యాండ్‌బాల్ పోటీలు ధర్మవరంలో జరిగాయి. ఉమ్మడి జిల్లా తరపున జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్న పరిగి జెడ్పీ స్కూల్ విద్యార్థినులు హర్షవల్లి, మంజు సత్తాచాటారు. వీరు ఈనెల 21న కర్నూలులో నిర్వహించే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృపాసత్యరాజు తెలిపారు. గురువారం స్థానిక పాఠశాలలో విద్యార్థులను హెచ్‌ఎం, పీడీ వినోద్, ఉపాధ్యాయులు అభినందించారు.

యూనిక్ ఐడీ తప్పనిసరి

అగళి: ప్రతి రైతూ తప్పనిసరిగా ఏపీ ఫార్మర్ రిజిస్ట్రేషన్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయించుకోవడం ద్వారా యూనిక్ ఐడీ పొందాలని వ్యవసాయాధికారి శేఖర్ నాయక్ సూచించారు. గురువారం మండలంలోని పీ బ్యాడగేర, మధూడి, ఇనగలూరు రైతు సేవ కేంద్రంలో రైతులకు యూనిక్ ఐడీ నమోదుపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఒక రైతుకు ఎన్ని చోట్ల భూమి ఉన్న ఏదైనా ఒక రైతు సేవ కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకుంటే సరిపోతుందన్నారు. భవిష్యత్‌లో యూనిక్ ఐడీ ఉన్న రైతులకే పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాలు అందుతాయన్నారు.